

దాదాపు రెండు వందల ఏండ్లు సాగిన బ్రిటిష్ వారి వలస పాలన, దానికి వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటం, దేశ విభజన, మత కలహాల నేపథ్యంలో భారత రాజ్యాంగం రూపొందింది. కాబట్టి, ప్రజల ఆకాంక్షలు, దేశ సమగ్రత, ఐక్యతను దృష్టిలో పెట్టుకుని ప్రజాస్వామ్య సమాజ స్థాపన లక్ష్యంగా రాజ్యాంగ నిర్మాతలు ఆలోచించారు. రాజ్యాంగ నిర్మాతల్లో కొంతమంది గాంధేయవాదులు, ఇంకొంతమంది సామ్యవాదులు, మరికొంతమంది ఏదో ఒక వర్గానికి ప్రాతినిధ్యం వహించే వారు ఉన్నారు. అయినప్పటికీ రాజ్యాంగ రచన విషయంలో అందరూ గొప్ప ఆలోచనలతోనే పనిచేశారు. వారి లక్ష్యం అంతా ఒక్కటే... ప్రజల ఆలోచనలు, ఆదర్శాలను ప్రతిబింబించేలా భారతదేశానికి ఓ మంచి రాజ్యాంగాన్ని రూపొందించడమే. దేశ ప్రజలకూ, ప్రజాస్వామ్యానికీ వజ్రకవచంగా రూపుదిద్దుకున్న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి నేటికి సరిగ్గా 75 ఏండ్లు. ఈ సందర్భంగా మన రాజ్యాంగ నిర్మాణ విశేషాలను తెలుసుకుందాం.

...✍ చింతలపల్లి హర్షవర్ధన్

కవర్ స్టోరీ

# దేశానికి వజ్ర కవచం

భారతదేశ పరిపాలనకు అవసరమైన మౌలిక పుస్తక రచన కోసం వివిధ రంగాల ప్రముఖులతో 1946లో ఓ రాజ్యాంగ సభ ఏర్పాటైంది. ఇందులో అప్పటి బ్రిటిష్ పాలిత భారతదేశ రాష్ట్రాల నుంచి పరోక్షంగా ఎన్నికైన ప్రతినిధులతోపాటు స్వదేశీ సంస్థానాల నుంచి నామినేట్ అయిన వాళ్లూ సభ్యులుగా ఉన్నారు. పాకిస్థాన్ ప్రత్యేక దేశంగా విడిపోవడంతో స్వతంత్ర భారతదేశ రాజ్యాంగ సభలో 299 మంది సభ్యులు ఉన్నారు. దీనికి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. రాజ్యాంగ రూపకల్పనలో కీలకపాత్ర పోషించిన 'డ్రాఫ్టింగ్ కమిటీ' (రచనా లేదా ముసాయిదా సంఘం)కి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అధ్యక్షత వహించారు. 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల్లో భారత రాజ్యాంగ రచనను రాజ్యాంగ సభ పూర్తిచేసింది.

### అతిపెద్ద రాజ్యాంగం

భారత రాజ్యాంగం రాతపూర్వకమైనది. అంటే నిర్ణీత సమయంలో రూపొందించుకుని, ఓ నిర్ణీత తేదీ నుంచి అమలులోకి వచ్చిన పుస్తకం అన్నమాట. రాజ్యాంగ రచన 1949 నవంబర్ 26 నాడు పూర్తయింది. అయితే, ఇది 1950 జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చింది. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు 395 అధికరణలు, 8 షెడ్యూళ్లు, 22 భాగాలు ఉన్నాయి. ప్రస్తుతం 448 అధికరణలు, 12 షెడ్యూళ్లు, 25 భాగాలు ఉన్నాయి. ఇప్పుడు ప్రపంచంలోని అన్ని దేశాలతో పోలిస్తే భారతదేశ రాజ్యాంగమే అతిపెద్దది.

### పార్లమెంటరీ ప్రజాస్వామ్యం

భారతదేశం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అనుసరిస్తున్నది. మనం పార్లమెంటరీ విధానాన్ని బ్రిటిష్ వారి నుంచి తీసుకున్నాం. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో చట్టసభలకు ఎన్నికైన సభ్యుల నుంచే ప్రభుత్వం ఏర్పడుతుంది. అలా కార్యనిర్వాహక వర్గం (ప్రభుత్వం), శాసన విభాగాల మధ్య సన్నిహిత సంబంధం ఉంటుంది. ప్రభుత్వం పార్లమెంట్ (లోక్‌సభ, రాష్ట్రాల్లో అయితే విధానసభ) శాసన విభాగానికి బాధ్యత వహిస్తుంది. చట్ట